

# దొంగదెబ్బ

మల్లీశ్వరి

ఏం చెయ్యాలిపుడు??...

నిన్నటినుంచీ వేధిస్తున్న ఈ ప్రశ్నని సమాధానపరిచే దారేది??...

దిక్కుతోచనితనం యిలా అన్నివైపుల నుంచీ కమ్ముకొస్తుందేం టీ??...

"జిలిమిలి జిలిమిలి గుంతలక...ఊ...ఆ...ఊ...ఆ..." సెకండ్ బియస్సీ తెలుగు క్లాస్‌లోంచి అరుపులు.

ఆ స్వరాల్లో విన్పిస్తున్న ఆధిపత్యం... హేళన కాళ్ళని చుట్టేసి అడుగు ముందుకు కదపనివ్వడం లేదు.

ఏ రోజయినా విద్యార్థులకి జడిసి క్లాసుకి వెళ్ళొద్దనిపించే క్షణం లేదే!! మరిపుడు... యింత అవమానం... యింత అసహాయత... యింత సిగ్గులేనితనాలను మోసుకుంటూ క్లాసుకి వెళ్ళాల్సిందేనా?...

"మీ సుఖమే నే కోరుకున్నా...మిము వీడి అందుకే వెళుతున్నా..." చెవి దగ్గరో చెయ్యి ముందుకు ముందుకు చాచిన మరో చేతితో అభినయం చేసి మరీ పాడుతూ, వాళ్ళు నా పరాభవానికి రంగం సిద్ధం చేస్తుంటే, నా భవిష్యత్తంతా వాళ్ళ చేతుల్లో వున్నంత భయం కొత్తగా కలుగుతోంది...

నిజమేగా... వీళ్ళిపుడు కాలేజిలో నా భవితవ్యాన్ని తేల్చే నిర్ణయాత్మక శక్తులు...

మా కాలేజిలో ఆర్ట్స్ గ్రూపుల్లో 'విద్యార్థులు చేరని కారణం'గా హిస్టరీ, పోలిటిక్స్, సోషియాలజీ...డిపార్ట్‌మెంట్లు రద్దు చేస్తున్నారు... యిక ఎక్కువయిన లెక్చరర్లు, తక్కువయిన విద్యార్థుల కారణంగా తెలుగు డిపార్ట్‌మెంట్‌లో వున్న యిద్దరు లెక్చరర్స్‌లో ఒకరిని తీసేస్తున్నారు...ఆఒకరూ ఎవరో ఓటింగ్ ద్వారా విద్యార్థులు నిర్ణయిస్తారు... మేనేజ్‌మెంట్‌కి బాధ లేకుండా...

**కథ**

ఆ యిద్దరిలో నేనొకదాన్ని.యింకా వారం రోజులే సమయముంది...

నేను మొహానికి గంభీరం ముసుగు తగిలించుకుని క్లాసులోకి వచ్చాను... యిన్నాళ్ళూ యిష్టంతోనో, అయిష్టంతోనో నన్ను చూసి నిశ్శబ్దంగా వుండే విద్యార్థులు యిపుడసలు పట్టించుకోవడం లేదు...

క్లాసంతా గోల... అరుపులు... ఆ మూల నుంచి ఈ మూలకి పుస్తకాలు విసురుకోడాలూ, ఆ బెంచీ నుంచి ఈ బెంచీకి ఎస్సెమ్మెస్‌లు పంపుకోడాలూ, అబ్బాయిలు వేళ్ళు ముడిచి మధ్యవేలు పైకెత్తడాలూ, ప్రతిగా అమ్మాయిల సిజర్స్ కటింగ్ సంకేతాలూ యధేచ్ఛగా సాగిపోతున్నాయి.

నాకు ఒళ్ళు దహించుకుపోతోంది... ఎంతకీ క్లాస్ కంట్రోల్ అవడం లేదు... ఈ పిల్లల్ని ఎంతగా అభిమానించాను!! వీళ్ళు అభివృద్ధిలోకి రావాలని ఎంత ఆరాటపడ్డాను!!... నేను వాళ్ళ నిజమయిన ఎదుగుదలని ఆశించాను కాబట్టే పరీక్షల్లో స్లిప్పులు అందివ్వలేదు... పాఠాలు ఎగ్గొట్టలేదు... ర్యాగింగ్‌కి సంబంధించి నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాను... ఆటలకి యితర పోటీలకి బలవంతంగా పంపించాను...

అంతేకాదు... తెలుగు లెక్చరర్లంటే రకరకాల వేషాలు వేసి నవ్వించే బఫూన్లు కాదనీ, జీవితపు మలుపుల దగ్గరా, అపుడపుడూ ఏర్పడే శూన్యం వద్దా నిలబడి తాము నేర్చిన విలువల జ్ఞాపకాల్ని అందించే మార్గదర్శులని చెప్పడానికి నిరంతరం ప్రయత్నించాను...

కానీ జనరేషన్ గాప్...

మెట్రో సెక్సువల్‌గా వుండటానికి యిష్టపడే అబ్బాయిలూ, మోడల్స్‌నీ, సినీ హీరోయిన్స్‌నీ అనుకరించే అమ్మాయిలూ కలిసి కెరేరే ధ్యేయంగా పాత విలువల మీద తిరుగుబాటు చేస్తున్నారు.

మార్కెట్ మాయాజాలపు వుచ్చులో చిక్కుకున్న పసికూనలు వాళ్ళు...వాళ్ళననేదేముంది?... నేనలా మౌనంగా పావుగంట నిల్చున్నాను... వాళ్ళకి ఆశ్చర్యం కలిగినట్లుంది. సద్దుమణిగారు... నేను పాఠం చెప్పి బయట పడ్డాను...

స్టాఫ్ రూంలో అందరూ నా వంక జాలిగా చూస్తున్నట్లనిపించింది. యిపుడు వీళ్ళందరి ముందూ నేను ధీమాగా...

"ఈ వుద్యోగం కాకపోతే యింకోటి... మన దగ్గర స్టఫ్ వుండాలే గానీ... ఎవరయినా పిలిచి యిస్తారు..." అని బిల్డప్ యివ్వాలి...

అప్రయత్నంగా నవ్వొచ్చింది... ఎవరు పిలుస్తారు?... పోనీ మనంతట మనమే ఏ కాలేజికయినా వెళ్ళి 'తెలుగు పోస్ట్‌లు ఏవయినా ఖాళీగా వున్నాయా?' అనడిగితే ముందు మనల్ని అనాగరికులుగా, అడవి మనుషులుగా భావించి ఎగాదిగా చూస్తారు. ఆనక మనమేదో జోక్ చేసినట్లు వాళ్ళు విరగబడి నవ్వుతూ "అసలు తెలుగు సబ్జెక్టే లేదు... యిక తెలుగు వేకెన్సీ ఎక్కడ?" అంటారు...

నేనిలా ఏడవలేని నవ్వు నవ్వుకుంటుంటే సంస్కృతం చెప్పే స్టాఫ్ నలుగురూ నా వంక వినోదంగా చూస్తున్నారు... లోతుగా చూస్తుంటే తెలుస్తోంది... వాళ్ళ మొహాల్లో ఒక విధమయిన రిలీఫ్...

కారణం నాకర్థమవుతోంది... నేను ప్రతి సంవత్సరం ఎడ్మిషన్స్ టైంలో ఆఫీస్‌లో కూర్చుని, తెలుగు భాష గొప్పదనాన్ని ప్రయోజనాలని వివరించి, సంస్కృతమో మరో భాషో తీసుకునే విద్యార్థులని ప్రభావితం చేసి బలవంతపు భాషా మార్పిడులకు పాల్పడుతుంటానని మా 'మృతభాషా బోధకుల'కి నా మీద కోపం...

మరి నాకూ వాళ్ళ మీద కోపమే!... వీళ్ళు 'ఒక భాష'ని చదువుకుని, 'మరో భాష'ని, 'యింకో భాష'లో చెపితే, విన్న విద్యార్థులు 'మరింకో భాష'లో పరీక్షలు రాస్తారు... అంటే నేను సంస్కృతం చదువుకుని, తెలుగు పాఠాల్ని, సంస్కృతంలో చెపితే, విద్యార్థులు యింగ్లీష్‌లో రాస్తే ఎలా వుంటుందో అలాగన్నమాట...

అయినా ఏం సాధించగలిగాను?... సంస్కృతంలో అయితే నూటికి నూరు మార్కులు వస్తాయని మార్కులే కోరుకునే తల్లిదండ్రులు సంస్కృతంలోనే చేర్పించేవారు...

వాళ్ళకి కావలసింది పిల్లలు ఎక్కువెక్కువ మార్కులు తెచ్చుకుని, మంచి మంచి వుద్యోగాలు సంపాదించి, డాలర్లు, డాలర్లు వెనకేయడం...అయినా వాళ్ళననేముంది?... ప్రవాహపు వుధృతి అలా వుంది. చాలామందికి ఏటికెదురీదడంలోకన్నా వాలులో పడి కొట్టుకుపోవడంలోనే సుఖముంటుంది... సంతోషం సంగతి ఎలా వున్నా...

తెలుగు పట్ల నాకున్న అభిమానం నిబద్ధత ఈరోజు అక్కరకు వస్తాయో రావోనని నేను భయపడటం నాకే ఆశ్చర్యంగా వుంది. ఎవరికీ

అక్కరలేనిదిగా, విలువలేనిదిగా ఎలా మారింది మన మాతృ భాష??...

మేం అయిదారువేల జీతాలకి యిక్కడ తన్నుకులాడుకుంటుంటే మా దగ్గర చదివిన విద్యార్థులే రెండుమూడేళ్ళు తిరిగేసరికి మాకన్నా పది రెట్ల జీతాల్ని పెంచుకుని ప్రత్యేకవర్గంగా మారుతుండటం ఎంత అభద్రతకు గురి చేసేది!!... 'తెలుగా? ఎగ్జామ్ ముందురోజు గైడ్ చదివితే చాలు' అని కొలీగ్స్ చేసే కామెంట్స్ ఎంత వుక్రోశాన్ని కలిగించేవి!!...

జీవికకి సంబంధించీ, విలువకి సంబంధించీ వున్న అసంతృప్తులను దిగమింగుకుని మాతృభాషని నమ్ముకున్నందుకుగానూ... ఈరోజు నమ్మిన కాళ్ళకింద భూమి కదులుతోంది...

నేను ఆలోచనలతో సతమతమవుతుండగా మా సైకాలజీ లెక్చరర్ గొంతు విన్పించింది.

"ఈరోజు సామాజిక శాస్త్రాలు రద్దు... రేపు మాతృభాష రద్దు, ఎల్లుండి ఈ కాలపు డబ్బు సంపాదనకి పనికి రానివన్నీ రద్దే!... కానీ... నాకో విషయం సంతోషంగా వుందండీ... ఎన్ని రద్దయినా మా డిపార్ట్‌మెంట్‌కి ఢోకా లేదు... రాబోయే రోజుల్లో ఈ ప్రపంచానికి మా అవసరమే ఎక్కువ... బయట బోర్డుపెడితే రోజుకి వంద మందికి తక్కువ కాకుండా వస్తారు... డబ్బే... డబ్బు..." పగలబడి నవ్వుతూ అన్నాడతను... నవ్వి నవ్వి మొహం ఎర్రబడిపోయి కళ్ళలో నీళ్ళు తిరగ్గా చటుక్కున లేచి బయటకు వెళ్ళిపోయాడు...

అందరం నివ్వెరపోయి చూడటం తప్ప అక్కడ వొలికిన కన్నీటి గురించి చర్చించే సాహసం చెయ్యలేకపోయాం.

** ** **

నిన్నటి వరకూ సెలవులో వున్న యింకో తెలుగు లెక్చరర్ నారాయణ ఈరోజు నుంచీ కాలేజికి వస్తున్నాడు... ఈ మూడు రోజులుగా నా ముఖభావాల్ని అంచనా కట్టి అలిసిపోయిన మా స్టాఫ్‌కి యిపుడు తాజాగా నారాయణ దొరికాడు...

అతనికి యింకా విషయం తెలీదు... రావడంతోనే క్లాస్‌కి వెళ్ళాడు.

అతనో చిన్నపాటి కవి... తెలుగుపట్ల ఆరాధన... భాషని అభిమానించడమనే కామన్ పాయింట్‌తో మేమి ద్దరం స్నేహంగా వుంటూ సాహితీ చర్చలు చేసేవాళ్ళం...

క్లాసవ్వగానే ధుమధుమలాడుతూ వచ్చాడతను...

"పిల్లలు రోజురోజుకీ కంట్రోల్ తప్పుతున్నారు. ఒకడు క్లాస్‌లో సెల్‌ఫోన్‌తో అమ్మాయిల ఫొటోలు తీస్తున్నాడు... వద్దని ఎంత చెప్పినా వినడే!... ప్రిన్సిపల్‌కి రిపోర్ట్ చేద్దామని తీసుకు వచ్చాను..." అన్నాడు.

స్టాఫ్‌రూం కాసేపు నిశ్శబ్దమయింది... గుమ్మం బయట నిల్చున్న స్టూడెంట్ వంక చూశాం. చూయింగమ్ నవులుతూ ఫాంట్ జేబులో ఎడంచెయ్యి... కుడి చేతితో జుట్టు సవరించుకోవడం... తనని కాదన్నట్లు నిల్చున్నాడు.

ఇంతలో మాథ్స్ లెక్చరర్ లేచి నారాయణని పక్కకి తీసుకెళ్ళి గుసగుసలాడాడు... యిపుడు అతని మొహంలో కంగారు... భయం... నా వంక అపనమ్మకంగా చూశాడు... ఆ తర్వాత వెంటనే ఆ స్టూడెంట్‌ని క్లాస్‌కి పంపేసాడు... యిక జెంట్స్ స్టాఫ్‌తో మంతనాలు... నన్ను తప్పుకు తప్పుకు తిరగడం మొదలుపెట్టాడు.

కొలీగ్స్‌గా మా మధ్య వున్న అవగాహనకి తూట్లు పడినట్లనిపించింది... మేమిపుడు ప్రత్యర్థులం కదా! ద్వేషించుకుని తీరాలేమో!...

ఆరోజు మధ్యాన్నం లంచవర్లో నారాయణ తను గొడవ పడిన స్టూడెంట్ భుజాల మీద చేతులు వేసుకుని నవ్వుతూ కాంటిన్‌కి వెళ్ళ డాన్ని విషాదంగా చూశాను...

ఇపుడు నా వుద్యోగాన్ని గురించిన ఆందోళన మరింతగా పెరిగింది... ఎందుకంటే నారాయణ అపుడే తన ప్రయత్నాలను ప్రారంభం చేశాడు.

ఒకవేళ ఈ ఓటింగ్‌లో నేనోడిపోతే...నాకు వుద్యోగం మళ్ళీ దొరుకుతుందా?... నాకీ వుద్యోగం ఎంత ముఖ్యం... నాకే కాదు... ఎవరయినా ఆర్థికస్వేచ్ఛని కలిగివుండి తమ జీవితాల్ని తామే శాసించుకోవడం ప్రాథమికావసరం కదా! యిపుడు నేనేం చెయ్యాలి?...

అతని క్లాస్‌లోంచి విన్పిస్తున్న చప్పట్లూ కేరింతలూ నాలో భయాన్ని పెంచుతున్నాయి...

మర్నాడు అతను క్లాసు నుంచి రాగానే...

"క్లాసులో ప్రబంధ కన్యలని అంగాంగ వర్ణన చేసినట్లున్నారే!..." హిందీ మేడమ్ నారాయణని చులకనగా చూసి అంది...


అతని మొహం మాడిపోయింది... నా వంక ఓసారి గిల్టీగా చూసి తల వంచుకున్నాడు... నాకపుడు అర్థమయింది... అతను కూడా చాలా నలిగిపోతున్నాడు. అంత విలువలు లేని మనిషేం కాదతను... జీవికకోసం పోరాటంలో ఆత్మాభిమానాన్ని చంపుకోడానికి సిద్ధపడ్డాడు... అంతే!...


జీవితకాలం అంటిపెట్టుకుని వుంటాయనుకున్న విలువల్నీ వాటిని నమ్ముకున్న మనుషుల్నీ సమూలంగా మార్చి పారేస్తున్న శక్తి ఏది?...

మారదామా? వద్దా? అనుకుంటున్న నాలోకీ? మారిపోతున్న అతనిలోకీ తొంగిచూస్తుంటే ఏదో వుద్రేకం... అంతలోనే చేతగానితనం వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఈ జీవితాలు యింతగా ఎలా చచ్చుబడిపోయాయి? ఎక్కడో ఎవరికో, ఏదో జరిగిందానికి పోరాడేది ఎలానూ లేదు... కనీసం తనదాకా వచ్చాకయినా వుద్యమించాలన్న కోరిక కలగడం లేదేంటీ?

అవునులే! నెలకో పిక్నిక్‌కీ, వారానికో సినిమాకీ, పూట పూటకీ టి.వి.కీ






గంటగంటకీ సెల్‌ఫోన్‌కీ, అప్పుడప్పుడూ ఫ్యాన్సీగా సంఘసేవకీ, ఎల్లపుడూ కెరీర్‌కీ అమ్ముడుపోయిన జీవితాల్లోంచి వుద్యమాలేం పుట్టుకు వస్తాయి?...

మా సంగతి సరే... ఆల్రెడీ శిఖరాలధిరోహించిన తెలుగువీరులకి తెలుసా?... యిక్కడ వెనుక వరస 'వాహనాలు' ధ్వంసమవుతున్న సంగతి?... కొండ అంచుని పట్టుకుని వేలాడుతున్నవాళ్ళంతా యిక ఓపికలు నశించి ఒక్కొక్కరే అధఃపాతాళానికి జారిపోతున్న సంగతి?... కాస్తంత ఓదార్పు... సంఘీభావం మార్గదర్శకత్వం ప్రకటించరా?

అసలు ముందు నేనీ స్థితి నుంచి ఎలా బయటపడాలి?... యింత రోత పుడుతున్న జీవితాన్ని ఎలా భరించాలి?... కాస్తయినా కదలిక చూపించొద్దూ!... కనీసం నాకోసం నేనయినా...

చివాలున లేచి ప్రిన్సిపల్ రూంవైపు నడవసాగాను... నా ముందు ముగ్గురమ్మాయిలు నడుస్తున్నారు... నన్ను చూడలేదు వాళ్ళు.

"మా తెలుగు మామ్‌కే మేం ఓట్ చెయ్యాలనుకుంటున్నాం... పాపం... ఏంటో... ఎపుడూ ఏదో చెప్పడానికే ట్రై చేస్తుంది... ఆవిడ బాధ మాకర్థంకాదు గానీ..." ఓ అమ్మాయి అంటోంది...

ఆ జాలి... నాలో ఆశని రేపబోయింది... వూగిసలాడాను... కాసేపే... కానీ అదికాదు సమస్య... ఓటింగ్‌ని అంగీకరించడమే సమస్య... నేను ముందుకే నడిచాను...

నేను వెళ్ళేసరికి ప్రిన్సిపల్ సీట్లోనే వున్నారు... నన్ను సాదరంగా పిలిచి "చెప్పమ్మా?..." అన్నారు.

"సర్! ఓటింగ్ గురించి..."నామాటని మధ్యలోనే చెయ్యెత్తి వారించి "కమిటీ డిసైడ్ చేసేసింది... అది తప్ప యింకేవయినా అడగండి..." నిష్కర్షగా అన్నాడతను...

ఆ సమాధానానికి బిక్కచచ్చిపోయాను...కాసేపటికి గొంతు పెగల్చుకుని...

"చనిపోయిన భాషమీదున్న కనికరం... జీవ భాష మీద లేకుండా..."

"ఎవరికి లేదు?...నాకా?... విద్యార్థులకా?... వాళ్ళ తల్లిదండ్రులకా?...ఎవరం ఏం చేశాం?... ఆలోచించండి... మీకే అర్థమవుతుంది... యిక సెంటిమెంట్స్ పెట్టుకు కూర్చుంటే నేను కాలేజి మూసేయాలి..." ఒకింత కఠినంగా వున్నాయి ప్రిన్సిపల్ మాటలు...

నన్ను చూసి జాలి కలిగినట్లుంది... మళ్ళీ అతనే...

"చూడండీ! మీలాంటి డైనమిక్ పర్సన్‌ని వదులుకోవడం మాకు మాత్రం యిష్టమా?..." మార్దవంగా అన్నారు...

'డైనమిక్ పర్సన్!!!' వుద్యోగంలో డైనమిక్ పర్సన్‌గా వుండటానికీ యింటి వద్ద విశ్వసనీయమయిన బానిసగా వుండటానికీ మధ్య ప్రతిరోజూ ప్రయాణం చేసి చేసి అలిసిపోయినా నిలబెట్టుకున్న డైనమిజమే ఈరోజు దేనికి వుపయోగపడుతుంది?...

మళ్ళీ అతనే...

"అందుకే నేనొకటి ప్రపోజ్ చేస్తున్నాను. ఒకవేళ ఓటింగ్‌లో మీరు నెగ్గకపోతే శాన్‌స్క్రిట్‌లోకి జంప్ అయిపోండి... మీ వరకూ ఆ అవకాశాన్ని యిస్తాను..." అన్నారు...

మొహాన ఛెళ్ళున చరిచినట్లయింది...

"సర్! నేనా?..." నమ్మలేనట్లు అడిగాను...

"అవునండీ!... లాంగ్వేజ్ లెక్చరర్స్ చెప్పడమూ, పిల్లలు వినడమూ ఎలాగూ వుండదు... రెండు మూడేళ్ళు తంటాలు పడితే ఎలాగోలా కుదురుకోవచ్చు..."

"సర్! డిగ్రీలకి సంబంధించి నేను తెలుగులో చిట్టచివరి గమ్యాన్నీ చేరాను... యిందుకోసం నాకు పాతికేళ్ళు వచ్చేవరకూ పరాన్నజీవిలా గడిపాను... ఈ చదువుకోసం మా కుటుంబం ఎంత ఖర్చుపెట్టిందీ!! నా మీద ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందీ!! యింతా వదిలేసి నాకు సంబంధంలేని సబ్జెక్ట్‌ని ఎలా చెప్పను?..." వుద్వేగంగా అన్నాను...

"ఇంకా యిలా చాదస్తంగా వుంటే లాభం లేదండీ! మాతృభాష అని పాకులాడుతున్నారుగానీ యిపుడు యింగ్లీష్‌కి తప్ప ఏ భాషకీ విలువ లేదు... మీరింకోపని కూడా చెయ్యొచ్చు... కంప్యూటర్స్ నేర్చుకుని ఆఫీస్‌వైపు షిఫ్ట్ అవ్వండి..." అని అతను అంటుంటే నన్నింతగా దిగజార్చుతున్న శక్తి మీద కోపం పెరిగిపోతోంది...

"అంతేతప్ప నే చదివిన చదువుకి యిక్కడ వుద్యోగం వుండదు... అంతేనా సర్!..."

"అది ఓటింగ్‌ని బట్టి..." అన్నారు ప్రిన్సిపల్.

"మొట్టమొదటగా నేను దానినే వ్యతిరేకిస్తున్నాను సర్... ఎందుకంటే యిది నా ఆత్మగౌరవానికి సంబంధించి మాత్రమే కాదు... నా మాతృభాషా గౌరవానికి సంబంధించింది కూడా... యిప్పటికే తలో చెయ్యీ వేసి అడుక్కి నెట్టేశారు... నేనిందులో భాగస్వామిని కాదల్చుకోలేదు..."

అతని మొహం సీరియస్‌గా మారింది... "సో!..."

"నేను రాజీనామా చేస్తున్నాను సర్!..." ప్రిన్సిపల్ విభ్రాంతిగా చూస్తుండగానే కవర్ అతని టేబిల్ మీద పెట్టాను...

"మీరు చెప్పిన ఆల్టర్నేటివ్స్ కన్నా నాలుగు పాడి పశువుల్ని పెట్టుకునో, కూరల పాదులు పెంచో వుత్పత్తిదారుగా మారడంలోనే గౌరవం వుందనిపిస్తోంది..." అన్నాను.

నవ్వాడతను... "మీరు ఆవేశంలో వున్నట్లున్నారు... బతకడానికి కావలసింది కాస్తంత లౌక్యం..." సలహానిచ్చారు... నేను కృతజ్ఞతలు చెప్పి బయటపడ్డాను.

నాకు మేనేజ్‌మెంట్ మీద కూడా పెద్దగా కోపం రావడంలేదు... ఎవరికి చిత్తశుద్ధి లేకపోవడం మూలంగా, ఎవరి సంకల్పం బలంగా లేకపోవడం మూలంగా ఈ పరిస్థితులు ఏర్పడ్డాయో అర్థమవుతోంది.

చిన్నపుడు సోషల్ పాఠాల్లో 'ఒక భావన' మనల్ని పరిపాలిస్తోందని చదివి, కంటికి కనపడని దాని శక్తికి ఆశ్చర్యపోయాను...

ఇపుడు అది కొట్టిన దొంగదెబ్బకు విశ్వరూప సందర్శనమయి పొట్టచేత పట్టుకుని రోడ్డున పడ్డాను.

●

"ఇంకా యిలా చాదస్తంగా వుంటే లాభం లేదండీ! మాతృభాష అని పాకులాడుతున్నారుగానీ యిపుడు యింగ్లీష్‌కి తప్ప ఏ భాషకీ విలువ లేదు... మీరింకోపని కూడా చెయ్యొచ్చు... కంప్యూటర్స్ నేర్చుకుని ఆఫీస్‌వైపు షిఫ్ట్ అవ్వండి..." అని అతను అంటుంటే నన్నింతగా దిగజార్చుతున్న శక్తి మీద కోపం పెరిగిపోతోంది...